కార్మికులకు బీమా ఏది..?

నాపరాతి గనుల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి కత్తిమీద సాములా ఉంటుంది. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియదు. పనికి వెళ్లిన కార్మికులు తిరిగి క్షేమంగా ఇంటికి వస్తారన్న గ్యారెంటీ లేదు. గత ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకంతో కార్మికులకు భరోసా కల్పించింది. మృతిచెందిన కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.10 వేలు అందించి ఆదుకుంది. నెలలోనే బీమా నగదు వచ్చేలా చర్యలు తీసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా బీమా పథకం అమలు చేయకపోవడంతో వేలాది కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

- గనుల్లో ప్రమాదకరమైన పనులు
- తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనం
- జిల్లాలో 1150 హెక్టార్లలో నాపరాతి గనులు
- వెయ్యికి పైగా పాలిష్ ఫ్యాక్టరీలు
- 40 వేల మంది కార్మికులకు ఉపాధి


అంకిరెడ్డిపల్లె సమీపంలోని నాపరాతి గనిలో పనిచేస్తున్న కార్మికులు

కొలిమిగుండ్ల: జిల్లాలో బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో 1150 హెక్టార్లలో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ వెలికితీసిన నాపరాళ్లు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి. గనుల్లో ఉత్పత్తి అయిన నాపరాళ్లను ట్రాక్టర్లు, లారీల ద్వారా పాలిష్ ఫ్యాక్టరీలకు రవాణా చేస్తుంటారు. ఈ పరిశ్రమపై ఆధారపడి 40 వేల మంది వరకు జీవిస్తున్నారు. ఇందులో గని కార్మికులు, పాలిష్ ఫ్యాక్టరీల్లో పనిచేసే కూలీలు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, ట్రాక్టర్, లారీ డ్రైవర్లు ఉంటారు. ఎక్కడో ఒక చోట కార్మికులు ప్రమాదాల బారినపడి గాయాలపాలు కావడం, మృత్యువాత పడటం జరుగుతుంటాయి.

బీమాతోనే ధీమా

ప్రమాదకరమైన పనులు చేసే సమయంలో కార్మికులను మృత్యువు ఏ రూపంలో బలి తీసుకుంటుందో తెలియదు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి హఠాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగిపోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినా కార్మికులకు ధీమా కల్పించే బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో వేలాది కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల గనిలో పనిచేసే కార్మికులు, కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు ప్రమాదాలు, మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. గనుల్లో విద్యుత్‌తో పనిచేసే కోత యంత్రాలు రావడంతో కార్మికులు రాళ్లను కోత కోసే సమయంలో తరచూ ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. పాలిష్ ఫ్యాక్టరీలు, రాళ్లను ఎగుమతి చేసే సమయంలో ట్రాక్టర్లు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో డ్రైవర్లు, కార్మికులు మృతి చెందుతున్నారు. ప్రస్తుతం కార్మికుల కుటుంబాలకు బీమా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర పనులు చేసే చోటనే కార్మికులు గుండె పోటుకు గురై మృతి చెందిన కార్మికులు పదుల సంఖ్యలో ఉన్నారు.

భరోసా కల్పించిన వైఎస్సార్ బీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ బీమా పథకం ఎంతో మంది కార్మికుల కుటుంబాలను ఆదుకుంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో బీమా పథకాన్ని అమలు చేశారు. అప్పట్లో బీమా పథకం నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంది. కంపెనీలు ప్రీమియం పెంచేశాయి. అయితే పేదల సంక్షేమమే లక్ష్యంగా బీమా అమలు విషయంలో వెనక్కి తగ్గకుండా సొంతంగా వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చి బాధిత కుటుంబాలకు అండగా నిలిచింది. పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాలకు నేనున్నా అంటూ భరోసా కల్పించింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని బీమా పథకంలో నమోదు చేయించారు. మృతి చెందిన కుటుంబాలకు అదే రోజు గ్రామ సచివాలయ సిబ్బంది తక్షణ సాయం కింద రూ.10 వేలు అందిస్తూ వచ్చారు. నెల వ్యవధిలోనే నామిని బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేస్తుండేవారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీమా ప్రయోజనాలు ఇలా

సహజ మరణం	18 నుంచి 50 ఏళ్లు -రూ.లక్ష
ప్రమాద మరణం	18-70 ఏళ్లు-రూ.5లక్షలు
శాశ్వత వైకల్యం	18-70 ఏళ్లు-రూ.2.50 లక్షలు


బెలుం వద్ద లోడింగ్ చేస్తున్న కార్మికులు

ప్రమాదమని తెలిసినా తప్పదు



నాపరాళ్ల లోడింగ్ పని ప్రమాదమని తెలిసినా కుటుంబ పోషణ కోసం తప్పదు. ఏడేళ్లుగా లారీలు, ట్రాక్టర్లకు నాపరాళ్ల లోడింగ్ చేసే పని చేస్తున్నాను. రాళ్లను లారీలకు ఎత్తే సమయంలో విరిగి మీద పడుతుంటాయి. ఎంత జాగ్రత్తగా ఉన్నా కొన్ని సమయాల్లో దెబ్బలు తగులుతుంటాయి. గాయాలు మానాలంటే వేలు ఖర్చు పెట్టుకోవాల్సి ఉంటుంది. కార్మికుల కోసం బీమా పథకం అమలు చేయాలి.

–కంబగిరి, లోడింగ్ కార్మికుడు

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి



నాపరాతి గనుల్లో ప్రమాదకరమైన పనులు చేసే సమయంలో కార్మికులు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారు. ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేసి కార్మికుల కుటుంబాలకు బాసటగా నిలవాలి. ఇటీవల కాలంలో కరెంట్ కోత మిషన్‌లు రావడంతో పనిచేసే సమయంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. బీమా లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నారు.

–సుబ్బరాయుడు,గని కార్మిక సంఘం నాయకుడు

క్లుప్తంగా

డోన్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

డోన్ టౌన్: డోన్ సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ బాషా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన బజారిని కోసిగికి బదిలీ అయ్యారు. కోడుమూరులో పనిచేస్తున్న మహబూబ్ బాషా డోన్‌కు వచ్చారు.

బదిలీ సన్మానం


సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీంను సత్కరిస్తున్న సిబ్బంది

బేతంచెర్ల: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయిన అబ్దుల్ కరీంను బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ వనితా లక్ష్మి, స్టాంప్ వెండర్ దూదేకుల హుసేనమ్మ, డాక్యుమెంట్ రైటర్లు రమణ, రాజు పాల్గొన్నారు.

విద్యార్థి దశ జీవితానికి పునాది

బేతంచెర్ల: విద్యార్థి దశలో సమయం వృథా చేసుకోకుండా బాగా చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ సోమశేఖర్, మాజీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ అన్నారు. బుధవారం పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో సమయం చాలా విలువైందని.. ప్రణాళిక ప్రకారం చదివితే లక్ష్యం చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, సుమేధా హైస్కూల్ డైరక్టర్ విజయ నాగరాజు, అధ్యాపకులు రాజు, రవి, హరి పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షకు విశేష స్పందన

డోన్ టౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. బుధవారం డోన్‌లోని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో 8,9,10వ తరగతులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మూఢ నమ్మకాలతో అభివృద్ధి కుంటుపడుతుందని హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శాస్త్రీయ విజ్ఞానంతో అభివృద్ధి బాటలో పయనించాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


నాటిక రూపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పట్టణంలోని జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై నాటిక, నృత్యాలు, ప్రసంగం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ రాధిక మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం వల్ల పారిశుద్ధ్యం లోపించి దోమలు అధికమై డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, తదితర విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఈఓ గోపినాథ్, నాయకులు లింగన్న, చాందిని, కాల్వ శ్రీవాణి, కాల్వ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం

కోవెలకుంట్ల: మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులకు ఇదే మండలంలో స్థాన చలనం కల్పిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కోవెలకుంట్ల మండలం బిజనవేముల పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథరెడ్డిని కలుగొట్లకు, రేవనూరు పీఎస్ నాగమల్లేశ్వరిని చిన్నకొప్పెర్లకు, భీమునిపాడు పీఎస్ నాగలక్ష్మిని బిజనవేములకు, అశోక్‌కుమార్‌రెడ్డిని చిన్నకొప్పెర్ల నుంచి రేవనూరుకు స్థానచలనం కల్పించారన్నారు. గుళ్లదూర్తి కార్యదర్శి శారదను భీమునిపాడుకు, సౌదరదిన్నె పీఎస్ అన్వర్‌ను గుళ్లదూర్తికి నియమించారని తెలిపారు. కలుగొట్ల పంచాయతీ కార్యదర్శి షఫీవుల్లాను నంద్యాల మండలం చాబోలుకు బదిలీ చేయగా గడివేముల మండలం దుర్వేశి పీఎస్‌గా పనిచేస్తున్న కేవీ సుబ్బారెడ్డిని కోవెలకుంట్ల మండలం అమడాల పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేసినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

డోన్ టౌన్: మండలంలోని ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ ఆర్డీఓ మహేశ్వరెడ్డి, తహసీల్దార్ నాగమణికి విజ్ఞప్తి చేశారు. బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తూ ప్రభుత్వ భూములను కలుపుకుని ప్లాట్‌లు వేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. కళ్యాణి ఎస్టేట్ సర్వే నంబర్ 380–బిలో 65 సెంట్లు, గుత్తి రోడ్డు సర్వే నంబర్ 503లో 8 ఎకరాల 51 సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


చిన్నపాదిళ్లలో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

ప్యాపిలి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ మధుసూదన్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పెద్దపాదిళ్ల, చిన్నపాదిళ్లలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, మట్కాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు


పసుపల గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజశేఖర్


డోన్: మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: పంటల సాగులో రైతులు సాంకేతిక పద్ధతులు పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు డి.రాజశేఖర్ సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పసుపల, పాతపాడు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ద్వారా పంటల్లో చీడపీడలను గుర్తించి వాటికి సంబంధించిన పరిష్కారాలు కనుక్కోవడం జరుగుతుందన్నారు. అలాగే యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు వివిధ పంటల్లో వచ్చే చీడపీడల నివారణ పద్ధతులను వివరించారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి పశువైద్యుడు రామ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఉద్యానవనశాఖ అధికారి రఘువరణ్, ఏఓ సుబ్బారెడ్డి, సర్పంచ్ మోహన్ బాబు పాల్గొన్నారు.

- డోన్ రూరల్: ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ద్వారా సాగులో పెట్టుబడులను తగ్గించుకోవడంతో పాటు అనేక ఉపయోగాలు ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం, గుమ్మకొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ పొలంలో చీడ పురుగులు, తెగుళ్లను ఫోన్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం ద్వారా ఏ పురుగు లేదా తెగుళ్లు ఉందో గుర్తించి మందులను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ, టెక్నికల్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, గణేష్, హరిప్రియ పాల్గొన్నారు.
- బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం, ఎం.పేండేకల్లు గ్రామాల్లో ఏఓ కిరణ్ కుమార్ రైతులతో సమావేశాలు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు.
- ప్యాపిలి: రైతులు అధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి రాజేశ్, ఉద్యానఅధికారిణి కళ్యాణి సూచించారు. పెద్దపాదిళ్ల, కలచట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సైంటిస్టు వెంకటరమణ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పంట మార్పిడి, అంతర పంటల సాగుతో మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

సంజామల: రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు భూసారం పెంపుకోసం పచ్చిరొట్ట ఎరువులను వాడాలని సూచించారు. రసాయనిక పురుగు మందులతో భూసారం తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. పంటకు చీడపురుగులు ఆశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ రఘుబాల క్రిష్ణ, మానస పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సకాలంలో బిల్లులు


సంజామల: సిబ్బందితో సమీక్షిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి

సంజామల: గత ప్రభుత్వంలో మంజూరైన జగనన్న కాలనీల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సంజామల స్పెషల్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి, హౌసింగ్ ఏఈ బాల చంద్రుడుతో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో సమీక్షించారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు అందజేస్తామని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణానాలను పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంఈఓ ఈశ్వరయ్య, ఏఈ గౌస్ పాల్గొన్నారు.

- బనగానపల్లె రూరల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 28వ తేదీ మన ఇల్లు–మన గౌరవం అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ మహేష్, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, ఎంఈఓ స్వరూప, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.
- అవుకు: ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగితిన పూర్తయ్యేలా మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సి.హెచ్ సత్యనారాయణ అన్నారు. బుధవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని తెలిపారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, పశువైద్యురాలు భారతీదేవి, హౌసింగ్ ఏఈ క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

‘ఎవరూ అధైర్య పడొద్దు.. భవిష్యత్తు మనదే’

- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కాటసాని భరోసా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓటమి పాలైందని ఎవరూ అధైర్య పడొద్దని.. భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భరోసా కల్పించారు. బుధవారం పట్టణంలోని ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి స్వగృహంలో పార్టీ బూత్ కన్వీనర్లు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాటసాని మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తన గెలుపు కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఓటమి పాలయ్యామని, ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, రాబోయేవి మంచి రోజులని ఓపిక పట్టాలని సూచించారు. ఎన్నికల్లో కూటమి పార్టీకి ఎందుకు ఓటు వేశామని మూడు నెలల్లోనే ప్రజలు మనోవేదన చెందుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి మేలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.

టీడీపీవి కక్షసాధింపు రాజకీయాలు

టీడీపీ సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోకుండా రేషన్ డీలర్లు, వెలుగు బుక్‌కీపర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను తొలగించే కుట్ర రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వంద రోజుల పాలన అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందకు తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు వాడినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేకపోయినా ఇలాంటి చర్యలకు పూనుకోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, పార్టీ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, దిల్కాబాషా, సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, బాలమద్దిలేటి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, అమడాల శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అక్బర్ బాషా, గజ్జెలరెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

కామని కుటుంబానికి కాటసాని పరామర్శ


కామని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

పట్టణానికి చెందిన సాగునీటి ఉద్యమ నేత, ఆ సంఘం రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం కోవెలకుంట్లకు చేరుకుని కామని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్య రమాదేవి, కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి, కుమార్తెలను ఓదార్చి సానుభూతి తెలిపారు. 24 ఏళ్ల క్రితం కుందూనది పోరాట సమితిని ఏర్పాటు చేసి సాగునీటి విడుదల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. అవుకు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, సిద్ధేశ్వరం అలుగు ఏర్పాటు కోసం రైతుల పక్షాన నిలిచి ఆందోళనలు చేశారని కొనియాడారు. ఆయన కుటుంబానికి ఎల్ల వేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, కామని మహేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, అక్బర్‌బాషా పాల్గొన్నారు.

కార్యకర్తకు నివాళి

బనగానపల్లె: పట్టణంలోని ఖాన్ రైస్ మిల్లు వద్ద నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త హాజీ(32) అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు బుధవారం మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. రోటో, లియాఖత్ తదితరులు ఉన్నారు.

29న మెగా వైద్య శిబిరం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులువీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సాధారణ పరీక్షలతో పాటు గుండె నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు.

రేపు నియోజకవర్గస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–14, 17 బాలబాలికల నియోజకవర్గస్థాయి క్రీడా ఎంపిక పోటీలు జరుగుతాయని ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే హాజరుకావాలని ఎంఈఓలు తెలిపారు.

రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. త్వరలో న్యాక్ బృందం కళాశాలను సందర్శించనుందని చెప్పారు. కళాశాల అభివృద్ధి, సాధించిన ఫలితాలు, తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే న్యాక్ బృందానికి పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు సూచనలు, సలహాలు అందజేసే విషయంపై చర్చించడం జరుగుతుందన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీనివాస యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన ఇల్లు–మనగౌరవం కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, హౌసింగ్ ఏఈ మద్దిలేటితో కలిసి సమీక్ష నిర్వహించారు. పీఎంఏవై కింద మంజూరైన గృహాలను అక్టోబర్ 31లోగా బీఎల్, ఆర్‌సీ స్థాయిలో ఉన్న వాటిని పూర్తి చేయించాలని సూచించారు. 2025 మార్చి 21వ తేదీ నాటికి గృహాలన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ప్యాపిలి: నరసింహులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

ప్యాపిలి/డోన్ టౌన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్యాపిలి ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహులు గత నెల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య కీర్తిని పరామర్శించి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే వెంగళాంపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామును పరామర్శించారు. అనంతరం రామకృష్ణాపురంలో ఉప సర్పంచ్ ధనుంజయశెట్టి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సర్పంచ్‌లు దస్తగిరి, రంగస్వామి, ఎంపీటీసీ సభ్యుడు రంగన్న, మండల కన్వీనర్ పోతుదొడ్డి క్రిష్ణమూర్తి ఉన్నారు. అలాగే డోన్ మండలం యాపదిన్నె మాజీ సర్పంచ్ రంగారెడ్డిని పరామర్శించారు. పట్టణంలోని పాతపేటకు చెందిన కౌన్సిలర్ కటికె వేణును కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, లాయర్లు విశ్వనాథ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్తం

క్రమశిక్షణ లేని విద్య వ్యర్థం

అవుకు: క్రమశిక్షణ లేని విద్య వ్యర్థమని ప్రముఖ వ్యాఖ్యాత హైగ్రీవాచార్యులు అన్నారు. అవుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఉండాల్సిన అవినావభావ సంబంధం తెలియజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎంత గొప్ప స్థానాల్లో ఉన్నా గురువును మరవ కూడదన్నారు. తల్లి, తండ్రి తరువాత గురువుకే ప్రాధాన్యత ఉందని తెలిపారు. 60 ఏళ్ల క్రితం లక్ష్మీరాజ్యం తన నటనతో వచ్చిన కొంత సొమ్మును పాఠశాల నిర్మాణానికి విరాళంగా ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

సంజామల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మండల స్పెషల్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూర్బా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని తెలిపారు. మొక్కలు నాటడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంత, సుగుణ, ప్రిన్సిపాల్ శ్రీలేఖ పాల్గొన్నారు.

నివాళి

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెరుకులపాడు శివయ్య భార్య ఆదిలక్ష్మి(38), కుమార్తె తేజ(18) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నాయకులు బాబుల్ రెడ్డి, మూర్తుజావలీ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట పార్టీ నాయకులు రవి, గురుమూర్తి, వెంకటేశ్వర్లు, రమణ, రామకృష్ణ ఉన్నారు.

జీఓ 85ని రద్దు చేయాలి

డోన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ల ఇన్‌సర్వీస్ కోటను 30 శాతం నుంచి 15 శాతం తగ్గిస్తూ జీఓ నంబర్ 85ను తీసుకుని రావడం దారుణమని.. వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డోన్ తాలుక అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, కార్యదర్శి సునీల్‌కుమార్, ట్రెజరర్ లక్ష్మణ్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్లకు న్యాయం చేయాలని కోరారు. వైద్య సిబ్బంది వెంకటలక్ష్మమ్మ, శంకరమ్మ, నాగరత్నమ్మ, పెద్దక్క, వెంకటకుమార్‌రెడ్డి, ప్రణీత్, సుజాత పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటలో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీ రామవెంకట సుబ్రమణ్యం కోరారు. ఈ మేరకు బుధవారం ఆలయంలో ఆహ్వాన బుక్‌లెట్స్‌ను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాథంశెట్టి వేణుగోపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు జక్కా నాగరాజు, నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయకుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, గుండా శ్రీనివాసులు, జంగంశెట్టి, గుండారవికుమార్, రామక్రిష్ణయ్య, బచ్చు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.